## క్లుప్తంగా

### విద్యతోనే సమాజంలో మార్పు: ఎంపీపీ నిర్మల



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన ఎంపీపీ నిర్మల, ఉపాధ్యాయులు

**తలకొండపల్లి:** విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని ఎంపీపీ నిర్మల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత, మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అందజేసిన క్రీడా దుస్తులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, సర్పంచ్ కిష్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యా కమిటీ కార్యవర్గ సభ్యులు ఎమిరెడ్డి రంగారెడ్డి, కుమార్, రంగారెడ్డి, నర్సింహ, హెచ్‌ఎంలు రామనాథం, శ్రీనివాసులు, ఎంపీటీసీలు పెంటమ్మ, రమేష్, రామస్వామి, విష్ణుగౌడ్, శంకర్, పాండునాయక్, రాకేష్ పాల్గొన్నారు.

### రేపు పాఠశాల వార్షికోత్సవం

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఎంపీ పటేల్‌గూడ ప్రభుత్వపాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు కుకుడాల యాదిరెడ్డి తెలిపారు. విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరుకాగలరని కోరారు.

### కొనసాగుతున్న ఆలయ పునఃనిర్మాణ పనులు

**తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌లోని పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జేసీబీతో మట్టిని చదును చేసి లెవలింగ్ చేశారు. వేల సంవత్సరాల నాటి పురాతన ఆలయాన్ని సరికొత్త హంగులతో ఆధునిక ఆలయంగా పునఃనిర్మిస్తున్నారు. 9 పిల్లర్లతో ఆలయానికి స్లాబ్ వేయనున్నట్లు మాజీ ఎంపీటీసీ యాదయ్య తెలిపారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా సకల సదుపాయాలతో నిర్మించనున్నట్లు చెప్పారు. కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గౌతమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. దేశాభివృద్ధిలో ఓటు పాత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొప్పు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పశు వైద్యశిబిరం విజయవంతం

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ పరిధిలోని గౌరారం గ్రామంలో మంగళవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 54 పశువులకు చికిత్స నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా పశుపోషణ, పునరుత్పత్తి, పశువులకు వచ్చే రోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదగిరిరావ్, వైద్య సిబ్బంది మల్లీశ్వరి, యాదయ్య, శివ, పాలాక్ష, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### 291 మందికి కంటి పరీక్షలు

**తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు చంద్రధన కంటి వైద్య శిబిరాల్లో మంగళవారం 291 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరికొందరికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సైదమ్మ, కల్పన, శ్వేత, రామకృష్ణ, హెచ్‌ఎ మల్లయ్య, రామచంద్రయ్య, మాధవి, స్వాతి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** టమాటా(లోకల్) కిలో రూ.15, (618 రకం) రూ.15, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.40, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.28, క్యాబేజీ రూ.10, క్యారెట్ రూ.20. దొండ రూ.35, ఆలుగడ్డ రూ.21, ఉల్లి రూ.24, గోకర రూ.40, దోస రూ.28, పోరకాయ రూ.13, పొట్లకాయ రూ.13, అరటి కాయ రూ.09, చిక్కుడు రూ.50, అర్వి రూ.70, మునగ రూ.75, చిలగడ దుంప రూ.33, బీట్‌రూట్ రూ.15, కీర రూ.25, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

# ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- నేటి నుంచి శెట్టిపల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**ఆమనగల్లు:** జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి 30వ తేదీవరకు జరగనున్నాయి. ఈ ప్రాంతంలో ప్రారంభమయ్యే తొలి బ్రహ్మోత్సవాలు శెట్టిపల్లిలోని శ్రీవేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలతోనే ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 5రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

**కార్యక్రమాల వివరాలు**

ఈనెల 26న గణపతి పూజ, అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 27న ఉదయం శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, 11 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన, 28న ఉదయం రథోత్సవం, 8 గంటలకు సుదర్శన హోమం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 29న చక్రతీర్థం, 30న స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, బ్రాహ్మణసత్కారాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు ప్రతిరోజు రాత్రి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటకం ప్రదర్శించనున్నారు.

**ఏర్పాట్లు పూర్తిచేశాం**



శెట్టిపల్లిలో జరిగే శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి యేడాది వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు అసరమైన వసతులు కల్పిస్తున్నాం. భక్తులకు అన్నదానం చేయనున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించాలి. – గోదాదేవి, సర్పంచ్, శెట్టిపల్లి

# ముద్వీన్‌లో బ్యాంకు ఏర్పాటు చేయండి

ఎంపీ రాములుకు గ్రామ సర్పంచ్ వినతి



ఎంపీ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ యాదయ్య, నాయకులు

**కడ్తాల్:** మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో ప్రభుత్వం రంగ బ్యాంకు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ నక్కపోతు యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములును కలిసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలో మారుమూలలో ఉన్న ముద్వీన్ గ్రామంలో బ్యాంక్ లేకపోవడంతో పరిసరా గ్రామాలైన చరికొండ, పల్లెచెలక, నాగిళ్ల, ఫిరోజ్‌నగర్, శెట్టిపల్లి, కోర్షకొండ, ఎక్వాయపల్లి, గౌరారం, మర్రిపల్లి, బోయిన్‌గుట్టకు చెందిన రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు, చిరువ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే ముద్వీన్ గ్రామంలో ఎదైనా ఒక ప్రభుత్వ రంగ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ముద్వీన్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ రాములుకు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కడ్తాల్ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు జంగయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అనితారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** గౌరెల్లి గ్రామాభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ.15లక్షల నిధులను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మంజూరు చేశారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీఖాన్, సర్పంచ్ తుడుం మల్లేష్‌కు నిధులకు సంబంధించి మంజూరు పత్రాన్ని చైర్‌పర్సన్ మంగళవారం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు తెచ్చి గౌరెల్లిని అభివృద్ధి చేస్తామన్నారు.

# దళిత, గిరిజన కుటుంబాల్లో వెలుగులు

ప్రగతి నివేదన యాత్రలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



క్రికెట్ కిట్ అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

**యాచారం:** దళిత, గిరిజన కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ సర్కార్ కృషి చేస్తుందని ఆ పార్టీ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మూడో రోజు మంగళవారం ప్రగతి నివేదన పాదయాత్ర ఎర్రగొల్లతండా, నక్కగుట్టతండా, తక్కళ్లపల్లి తండా, తక్కళ్లపల్లి గ్రామాల్లో కొనసాగింది. 250కి పైగా ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాల్లో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారంపై ఆరా తీశారు. తక్కళ్లపల్లి తండాలో యువతకు క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, పాశ్ఛ భాషా, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, తక్కళ్లపల్లి తండా సర్పంచ్ జగదీష్‌నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు సుమతమ్మ, తక్కళ్లపల్లి గ్రామ సర్పంచ్ సంతోష, నాయకులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయండి

ఇబ్రహీంపట్నం, ఆమనగల్లులో ఏబీవీపీ నేతల రాస్తారోకో



ఆమనగల్లు: రాస్తారోకోలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు మంగళవారం ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు సాగర్ రహదారిపై బైఠాయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు శ్రీరామ్ మాట్లాడుతూ.. రూ.5000 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లల్లో జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ గురించి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు.. వంగ సంజీవరెడ్డి, శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ, జగదీష్, సందీప్, ప్రవీణ్,సందీప్, సాయి, చందు, సాయి, రాఘవేందర్, శివాణి, శివలీల, ఛోటు, జగదీష్, విజయేంద్ర, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.

**ఆమనగల్లులో ఏబీవీపీ రాస్తారోకో**

**ఆమనగల్లు:** విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ చౌరస్తా వద్ద మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు మల్లేశ్, భరత్, స్థానిక నాయకులు సురేశ్, తరుణ్, సుమన్, శివగౌడ్, అంజి, మల్లేశ్, శివ, కన్నా, చరణ్, మనోజ్, శివ, నవీన్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: సాగర్ రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

# ప్రభుత్వ బడులను కాపాడుకుందాం



తుర్కయంజాల్: ప్రధానోపాధ్యాయుడికి చెక్కు అందజేస్తున్న ధన్‌రాజ్

**తుర్కయంజాల్:** ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పురపాలక సంఘం పరిధి కొహెడ 2వ వార్డు కౌన్సిలర్ కంబాలపల్లి ధన్‌రాజ్ అన్నారు. మంగళవారం కొహెడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మైక్ సిస్టం కొనుగోలు చేయడానికి అవసరమయ్యే రూ.30వేల చెక్కును ప్రధానోపాధ్యాయులు రాజుకు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాఠశాలకు డ్యూయల్ డెస్క్‌ల వితరణ**

**మాడ్గుల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థులు 20 డ్యూయల్ డెస్క్‌లను అందజేశారు. పాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరంలో పదవతరగతి చదివిన విద్యార్థులు ముకుందా చారి, కలకొండ నరేశ్, ప్రకాశ్‌గౌడ్, శ్రీశైలంలు రూ.40 వేల విలువ కల్గిన 20 డ్యూయల్ డెస్క్‌లను విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం పాఠశాల యజమాన్యానికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామంజన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనుగౌడ్, ఉపాధ్యాయులు.. పూర్వపు విద్యార్థులను అభినందించారు.

# భక్త మార్కండేయ జయంతి వేడుకలు



వేడుకల్లో రాఘవేందర్‌రెడ్డి, నాయకులు

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో మంగళవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భక్తమార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ఉదయాన్నే భక్త మార్కండేయస్వామికి ఆలయ పూజారి నాగభూషణ స్వామి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తమార్కండేయస్వామికి మహిళాసంఘం ఆధ్వర్యంలో డోలారోహనం నిర్వహించి స్వామివారికి జోలపాటలు పాడి మంగళహారతులతో జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీసంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు అప్పం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శివలింగం, కోశాధికారి గాజుల సత్యారాములు, మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి, మహిళాసంఘం అధ్యక్షురాలు అప్పం అలివేలు, నాయకులు గిరి, శ్రీనివాస్, అప్పి, వెంకటేష్, శ్రీలత, సరిత, కవిత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



కేశవరెడ్డి, ఇమ్రాన్‌ను సన్మానించిన సభ్యులు

**తలకొండపల్లి:** భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగరావుపల్లి హన్‌మాన్ దేవాలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తైన సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి, అరవింద్, సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపత య్య, ఉపసర్పంచ్ మణికంఠ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి



వరిచేనును పరిశీలిస్తున్న అరుణకుమారి

**ఆమనగల్లు:** వరిపంటలో కాండం తొలచు పురుగు నివారించడానికి ఆరు కిలోలు నీలిప్రోలు గులికలు వేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో మంగళవారం సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన వరి మరియు భాస్వరం కరిగించు జీవన ఎరువు వేసిన వరిచేలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. రైతులు సరైన మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. రాత్రివేళ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల చలికి వరినారు చనిపోతుందని అందువల్ల రాత్రిపూట చేనులో ఉన్న నీళ్లను తీసివేసి కొత్త నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు సాయిరెడ్డి, ధర్మారెడ్డి, దస్‌పాల్‌రెడ్డి, అంజయ్య, అంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

## అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి

**తలకొండపల్లి:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూమిలేని నిరుపేద దళితులందరికీ 3 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుగ్గపురం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడుతూ.. ఇంటి స్థలం ఉండి ఇళ్లులేనివారికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రూ.10 లక్షల దళిత బంధు మంజూరు చేయాలన్నారు.

## కరువు భత్యం విడుదలపై పెన్షనర్ల జేఏసీ హర్షం

**వనస్థలిపురం:** పెన్షనర్ల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఒక విడత కరువు భత్యాన్ని విడుదల చేస్తూ జీవో (ఎంఎస్.నం.10) విడుదల చేయడంపై తెలంగాణ ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం వనస్థలిపురంలో జేఏసీ చైర్మన్ కే.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఇంకా మూడు విడతల డియర్నెస్ రిలీఫ్ (పెన్షనర్లకు ఇచ్చే కరువు భత్యం) ప్రభుత్వం నుంచి అందాల్సి ఉందని, ఆ మూడు విడతల కరువు భత్యాన్ని ఉగాది పండుగ సందర్భంగా మార్చి నెలలో విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ కో-చైర్మన్లు ఎం.సూర్యనారాయణ, కృష్ణమూర్తి, ఏ.రాజేంద్రబాబు, ఎం.భరత్‌రెడ్డి, సెక్రెటరి జనరల్ టి.సుభాకరరావు, వైస్ చైర్మన్ ఎస్.జ్ఞానేశ్వర్, కోశాధికారి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ప్రవీణ్



నియామకపత్రం అందుకుంటున్న ప్రవీణ్

**అబ్దుల్లాపూర్‌మెట్:** కాంగ్రెస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏర్పుల ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కోఆర్డినేటర్ పెట్టెం నవీన్ జారీచేసిన నియామకపత్రాన్ని మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా ప్రవీణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు చేరే విధంగా సోషల్ మీడియా ద్వారా నెటిజన్లకు తెలియపరుస్తామన్నారు. పార్టీ చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

**ఎల్‌బీనగర్:** కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు .డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ నూతన సంక్షేమ సంఘ సభ్యులు మంగళశారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చారి, ఉపాధ్యక్షులు జంగయ్యగౌడ్, సభ్యులు వెంకటేష్, పురుషోత్తం, రామాచారి, చందు. యాదయ్య, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలికల దినోత్సవం



మంచాల: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ అధ్యక్షుడు వర్కాల పరమేష్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబ్లీ, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

**గీతాంజలి మోడల్ స్కూల్‌లో..**

**మంచాల:** మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో మదర్‌గుడ్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గీతాంజలి మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ గుడ్ హెల్త్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నాయినంపల్లి శ్రీనివాస్, గీతాంజలి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య పాల్గొన్నారు.